
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 27 । నవంబర్ । 2023



సోమశిలలో 29.390 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 29.390 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఫైతట్టు ప్రాంతాల నుంచి 161 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,520
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,710
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,881
సవర (8 గ్రాములు)	రూ.47,048

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.9 /24.4

ఆదివారం గాలిలో తేమ 80 శాతం ఉంది. సోమవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేనేతల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా కన్వీనర్ బుదవరపు బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక హరనాథపురంలోని రాధే గెస్ట్ ఇన్‌లో కార్యక్రమం జరుగుతుందని, చేనేత సంఘాల ప్రతినిధులు, చేనేత ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కండలేరులో 11.099 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 11.099 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 235 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రాజ్యాంగం ద్వారా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచేందుకు, ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించడానికి కారణం మన రాజ్యాంగమేనని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జేసీ రాజ్యాంగం విశిష్టతను వివరించి అధికారులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగమన్నారు. ప్రజలకు రాజ్యాంగం విలువలు, రాజ్యాంగం ఔన్నత్యాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి షఫీమాలిక్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బా బాలికల పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉషారాణి

మర్రిపాడు: మర్రిపాడు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని ఆదివారం సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఉషారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు చదువులు ఎలా చెబుతున్నారు, భోజనం ఎలా ఉందంటూ అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ప్రిన్సిపల్ సీహెచ్ లక్ష్మీదేవి, పీఈటీ పద్మమ్మ తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్‌లో 'స్పందన' నేడు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి నిర్వహించనున్న కార్యక్రమంలో అర్జీలను అందజేయాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాల చెరువులో కార్తీక దీపాలను వదులుతున్న భక్తులు



నెల్లూరు గణేష్ నిమజ్జన ఘాట్‌లో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తురాలు



కార్తీక పౌర్ణమి సందర్భంగా మూలాపేట శివాలయంలో భక్తుల కోలాహలం

దేదీప్యం.. కార్తీక దీపం

హరిహరులకు ఎంతో ప్రీతిపాత్రమైన, పవిత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా సింహపురిలో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. జిల్లాలోని శైవక్షేత్రాల్లో పరమేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో జ్వాలాదీపం, ఆకాశదీపం వెలిగించి పూజలు చేశారు. భక్తుల శివ నామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మహిళలు ఆలయాల ఆవరణల్లో కార్తీక దీపాలు వెలిగించి పరమేశ్వరుడిని దర్శించుకున్నారు.

భవితకు భరోసా



చిన్నారుల భవిష్యత్‌కు భరోసా కల్పించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. బిడ్డ జన్మించిన వెంటనే వివరాలు నమోదు చేసి వారికి జనన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. అలాగే చిన్నారులకు ఆధార్ కార్డులు అందించేలా చర్యలు చేపట్టారు.

- చిన్నారులకు బాల ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం అందించేలా అధికారుల చొరవ
- బిడ్డ పుట్టిన 24 గంటల్లోపు నమోదు
- ప్రతి బిడ్డకు 'వైఎస్సార్ పోషణ అభయాన్' ద్వారా పౌష్టికాహారం
- చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



వింజమూరులోని సచివాలయంలో జనన ధ్రువీకరణ పత్రాలు అందుకున్న చిన్నారులతో తల్లులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : ప్రతి బిడ్డకు వైఎస్సార్ పోషణ అభియాన్ పథకం ద్వారా పౌష్టికాహారం అందించి, సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో జిల్లాలో ప్రత్యేకంగా చేపట్టిన బాల ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల నమోదు ప్రక్రియ సత్ఫలితాలనిస్తోంది. కలెక్టర్ ఎం.హరినారాయణన్ బాల ఆధార్ కార్డుల నమోదు, పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల మంజూరుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశాలిచ్చారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ చాలా మంది చిన్నారులకు ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో 'వైఎస్సార్ పోషణ అభియాన్' ద్వారా పౌష్టికాహారం లభించని విషయాన్ని గుర్తించారు. జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చిన్నారులందరికీ బాల ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు అందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాలోని ఆరేళ్ల లోపు వయస్సు గల చిన్నారులకు బాల ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందుతున్నాయి.

సత్వరమే అందించేలా చర్యలు

డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు సాంబశివరెడ్డి, హేనా సుజన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్ ఆధ్వర్యంలో బాల ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు సత్వరమే అందించేలా చర్యలు చేపట్టారు. బిడ్డ జన్మించిన 24 గంటల్లోపు జననాన్ని నమోదు చేస్తున్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ అధికారులు, ఆస్పత్రుల యాజమాన్యాలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలతో ఒక కమిటీని ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం ప్రాముఖ్యతను వివరించి వెంటనే ఇప్పించేలా ఏర్పాటు చేస్తున్నారు. సచివాలయాలు, సీడీపీఓ కార్యాలయాల్లో, కామన్ సర్వీస్ సెంటర్లలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి బాల ఆధార్ నమోదు చేసేలా చర్యలు చేపట్టారు. గత జూన్ నుంచి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటి వరకు 64,335 మంది చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు అవసరమని గుర్తించి వారిలో 97 శాతం మందికి అందించారు. అలాగే 65,400 మంది చిన్నారులకు ఆధార్ కార్డులు అవసరమని గుర్తించి వారిలో 76 శాతం మందికి అందించారు. ఇంకా మిగిలిన చిన్నారులకు కూడా అందించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు చేపడుతున్నారు. తద్వారా ప్రతి చిన్నారికీ ప్రభుత్వం అందిస్తున్న 'పోషణ అభియాన్' పౌష్టికాహారం అందుతోంది. అలాగే చిన్నపిల్లల వైద్యులు కూడా చిన్నారులను పరీక్షించి వైద్యసేవలు అందిస్తున్నారు.

జిల్లాలో..	
జనన ధ్రువీకరణ పత్రాలు పొందిన చిన్నారులు -	బాల ఆధార్ కార్డులు పొందిన చిన్నారులు -
62,952 మంది	50,150 మంది

ఇది నిరంతర ప్రక్రియ



జిల్లాలో జన్మించిన ప్రతి బిడ్డకు తల్లిదండ్రుల బయోమెట్రిక్ ఆధారంగా ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు అందించడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. ప్రభుత్వం చిన్నారుల సంక్షేమానికి కృషి చేస్తోంది. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి బిడ్డ జన్మించిన వెంటనే వాటిని పొందేందుకు సహకరించాలి.
– ఎం.హరినారాయణన్, కలెక్టర్

ప్రత్యేక క్యాంపులు

కలెక్టర్ ఆదేశాలతో సచివాలయాల పరిధిలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి అంగన్‌వాడి కేంద్రాల్లో ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు లేని చిన్నారులను గుర్తిస్తున్నాం. వీరందరికీ ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తల సహాయంతో ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు చేపట్టాం. జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.
– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

ఆగమోక్తంగా అంకురార్పణ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనసింహస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించనున్న ఏకోత్తర సహస్ర కలశాభిషేకానికి ఆదివారం రాత్రి ఆగమోక్తంగా అంకురార్పణ చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి విశేష అభిషేకం నిర్వహించారు. నందనవనం నుంచి పుట్టమన్ను సేకరించి ఆలయ అలంకార మండపంలో నవధాన్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఉభయ దేవేరులతో నృసింహస్వామికి 1,001 కలశాల పవిత్ర జలాలు, విశేష అమృతాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. సాయంత్రం వైభవంగా క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన

- సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్



విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్

ఆత్మకూరు: విద్యార్థి దశ నుంచే చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి డి రాజేష్ సూచించారు. మున్సిపల్ పరిధిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆయన ఆదివారం లీగల్ అవేర్‌నెస్ క్యాంపు, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అందరికి సమాన హక్కులు కల్పించిందని ఈ విషయంలో వివక్ష పనికి రాదన్నారు. వరకట్నం జాడ్యంలా మారిందని దానిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఎ. స్పందన, న్యాయవాదులు ఎల్‌వీ రమణయ్య, ఎం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

నెల్లూరు(సెంట్రల్): సమాజంలో ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని ఆమోదించగా, 1950 జనవరి 26న అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా రాజ్యాంగాన్ని మనకు అందించిన అంబేడ్కర్ చిరస్మరణీయులని అన్నారు. ఆ మహనీయునికి నివాళిగా ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచేలా విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీఆర్ అంబేడ్కర్ సేవలను గుర్తుచేసుకుంటూ రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ పి.రూప్ కుమార్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, మందల వెంకటశేషయ్య, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి, ప్రజాప్రతినిధులు, నాయకులు

ఆరోగ్యం జరభద్రం

వాతావరణంలో వచ్చిన మార్పులు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. లేదంటే సీజనల్ వ్యాధుల బారిన పడి అనారోగ్యం పాలవుతారని వైద్యాధికారులు చెబుతున్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు అప్రమత్తతే ఆరోగ్యరక్ష అని సూచిస్తున్నారు.

- వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- శుభ్రతతోనే వ్యాధులు దరిచేరవంటున్న వైద్యాధికారులు



నెల్లూరు నగరంలో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై తెలుసుకుంటున్న వైద్యసిబ్బంది(ఫైల్)

నెల్లూరు సిటీ: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడడం ద్వారా ఆస్పత్రుల వద్ద రోగుల తాకిడి పెరిగింది. ముఖ్యంగా జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పులతో రోగులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జ్వరం, జలుబుతో రోజుల తరబడి జాప్యం చేయడం మంచిది కాదని చెబుతున్నారు.


వాతావరణంలో మార్పులే కారణం

ఈ ఏడాది వర్షాలు కొంత ఆలస్యంగా వచ్చినప్పటికీ వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు జ్వరాల బారినపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆస్పత్రుల వద్ద ఓపీల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం వాతావరణంలో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామెర్లు, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. కలుషిత నీరు తాగడం ద్వారా టైఫాయిడ్, డయేరియా, దోమకాటు వల్ల మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో వైద్యారోగ్యశాఖ అధికారులు ఇప్పటికే అప్రమత్తమై సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తున్నారు. వైద్యారోగ్యశాఖ, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇళ్ల వద్ద కొబ్బరిబోండాలు, రోళ్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల్లో నీరు నిల్వ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యపరీక్షలు, చికిత్సలు చేయడంతోపాటు ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- చేతులను తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలి
- ఇళ్లలోకి దోమలు రాకుండా కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి
- దోమతెరలు వినియోగించాలి
- ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీరు తాగాలి
- వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి

క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం



వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. మలేరియా, డెంగీ తదితర జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో వైద్యారోగ్యశాఖ అధికారులు, ఏఎన్‌ఎంలు, సచివాలయ కార్యదర్శులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరిచేరవు.
– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. గూడూరుకు చెందిన కృష్ణప్రసాద్ పని నిమిత్తం ముత్తుకూరుకు మోటారుబైక్‌పై వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి గూడూరుకు వెళ్తుండగా కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై సర్వేపల్లి సమీపంలో ఆటోను తప్పించబోయి మోటారు బైక్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


రామసుబ్బారెడ్డి (ఫైల్)

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మనుబోలుకు చెందిన కసుమూరు రామసుబ్బారెడ్డి(60) నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. రామ సుబ్బారెడ్డి నెల రోజుల క్రితం నెల్లూరు నుంచి స్కూటీలో మనుబోలుకు వస్తూ అప్పయ్యగేటు సమీపంలో డివైడర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. అప్పట్నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి బలి


నరసింహారావు మృతదేహం

విడవలూరు: విద్యుదాఘాతానికి వ్యక్తి బలైన ఘటన మండలంలోని చౌకచర్లలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చౌకచర్లకు చెందిన ముప్పాల నరసింహారావు(35) ప్రైవేట్‌గా విద్యుత్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం పల్లిపాళెం కాలనీలో విద్యుత్ సరఫరా లేకపోడంతో స్థానికులు పిలవడంతో అక్కడికి వెళ్లాడు. విద్యుత్ స్తంభం ఎక్కి మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరసింహారావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నరసింహారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అదుపుతప్పి లారీని ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ పవన్‌కుమార్

మనుబోలు: కారు అదుపుతప్పి లారీని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు... కావలికి చెందిన వెంకటేశ్వరరావు కుటుంబంతో కలిసి శ్రీకాళహస్తికి వెళ్లారు. అక్కడ పూజలు చేసుకుని తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్, ఆపై చెన్నై నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళుతున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇందుమతి, కుమారుడు పవన్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్వర్ణ టోల్‌వే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం


ఘటనా స్థలంలో సుహాసిని మృతదేహం

ముత్తుకూరు: మోటార్‌సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన కృష్ణపట్నం పోర్టులోని రైల్వేగేటు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు..కృష్ణపట్నం గ్రామానికి చెందిన బొనిగి శ్రీనివాసులు ఆదాని కృష్ణపట్నం పోర్టులో మీడియా మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం భార్య సుహాసిని(38)తో కలసి కోట మండలం విద్యానగర్‌లో ఇంజినీరింగ్ చదువుతున్న కుమార్తె వద్దకు వెళ్లారు. కుమార్తెను చూసి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పోర్టులోని రైల్వేగేటు సమీపంలో వెనుకగా వస్తున్న వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కిందపడిన సుహాసినిపై బస్సు టైర్లు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మోటార్‌సైకిల్‌తో పాటు మరో వైపు పడిన శ్రీనివాసులు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తన కళ్ల ఎదుటే భార్య దుర్మరణం పాలవడంతో శ్రీనివాసులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కృష్ణపట్నం ఎస్సై శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సుహాసిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


నెల్లూరు గణేష్ నిమజ్జన ఘాట్‌లో శివకేశవుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


ముత్తుకూరులో సిద్ధేశ్వరస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



సంగంలోని సంగమేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన పుష్పాలంకృత శివలింగం

హర హర మహాదేవ


నెల్లూరు స్వర్ణాల చెరువులో కార్తీక దీపాలు వదలుతున్న భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆది దంపతులను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీప కాంతుల్లో శైవక్షేత్రాలు శోభిల్లాయి. భక్తుల శివ నామస్మరణతో ఆది దంపతుల కొలువులు పులకించాయి. నెల్లూరులో సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో మహాకార్తీక దీపోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్దనున్న గణేష్ ఘాట్ వద్ద అరుణాచలేశ్వరుడి శివలింగాన్ని ప్రతిష్ఠించి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం నగరంలో మహిళలు కార్తీక దీపాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్వర్ణాల చెరువు వద్దకు చేరుకుని కార్తీక దీపాలను వదిలారు. కాగా మైపాడు సాగర తీరంలో భక్తజన కోలాహలం నెలకొంది. సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఒడ్డున ఉన్న శైవక్షేత్రంలోని మహాశివలింగానికి అభిషేకాలు చేశారు.

–సాక్షి, నెట్‌వర్క్


నెల్లూరు స్వర్ణాల చెరువులో గంగమ్మకు హారతి ఇస్తున్న దృశ్యం


బాలాజీనగర్‌లోని రామ మందిరంలో పుష్ప, కార్తీక దీపాలంకృత శివలింగం


ఇందుకూరుపేట: మైపాడు బీచ్ వద్ద మహా శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు


వింజమూరులో అన్నాభిషేక అలంకారంలో ఓంకారేశ్వరుడు

ఇద్దరు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్


గంజాయితో పాటు నిందితులను చూపుతున్న సెబ్ అధికారులు

గూడూరురూరల్ : చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు స్మగ్లర్లను సెబ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదివారం టూటౌన్‌లోని సెబ్ కార్యాలయంలో సీఐ విజయ్‌కుమార్ నిందితుల వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన సూర్య, హేమలత కర్ణాటక రాష్ట్రం కోలార్ వద్ద ఇటుక బట్టీలో పనిచేసేవారు. అక్కడి కూలీలకు ఉన్న గంజాయి అలవాటును సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒడిశాలోని సింధూరం డాంగ్ అటవీప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి కోలార్‌లో విక్రయించసాగారు. గతంలో వారు ఇదే కేసుల్లో జైలుకు కూడా వెళ్లి వచ్చారు. ఈ నేపథ్యంలో వారు బస్సులో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సెబ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టగా పట్టుబడ్డారు. నిందితుల నుంచి రూ.3 లక్షల విలువైన 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, సిబ్బంది గౌస్‌బాషా, రామ్‌ప్రసాద్, రమేష్, ఆనంద్‌బాబు, రాఘవయ్య, ప్రసాద్, కృష్ణయ్య పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి కోసం గాలింపు


గాలింపు చర్యల్లో పోలీసులు

వాకాడు : మండలంలోని తూపిలిపాళెం వద్ద సముద్రంలో శనివారం గల్లంతైన యువకుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలు.. ఓజిలి మండలం రాజుపాళెం గ్రామానికి చెందిన రుషిక్ తన నలుగురు స్నేహితులతో కలసి ఆటోలో తూపిలిపాళెం బీచ్‌కు వచ్చాడు. స్నానం చేస్తున్న క్రమంలో అలల తాకిడికి గల్లంతయ్యాడు. వెంటనే స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్పటి నుంచి కుటుంబీకులతోపాటు పోలీసులు, మత్స్యకారులు, మెరైన్ సిబ్బంది గాలిస్తున్నా ఇప్పటికీ యువకుడి ఆచూకీ తెలియలేదు. ఆదివారం మధ్యాహ్నం రుషిక్ మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చిందని, మళ్లీ సముద్రంలోకి వెళ్లిపోయిందని స్థానిక మత్స్యకారులు వెల్లడించారు. దీంతో పోలీసులు గజఈతగాళ్లను రప్పించి బోట్లలో సముద్రంలోకి వెళ్లి గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. సోమవారం ఉదయం నుంచి గాలింపు చర్యలను కొనసాగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.95
లేయర్ (లైవ్)	: రూ.100
బ్రాయిలర్ చికెన్	: రూ.174
స్కిన్‌లెస్ చికెన్	: రూ.194
లేయర్ చికెన్	: రూ.170

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.8

విధి వంచిత

- రోడ్డు ప్రమాదం ఆ కుటుంబానికి తీరని శోకం
- ముగ్గురు బిడ్డల తల్లి మూడేళ్లుగా మంచానికే పరిమితం


మంచానికే పరిమితమైన పద్మకు సపర్యలు చేస్తున్న కుమారులు, కూమార్తె

ఆత్మకూరురూరల్: రోజూ కూలీ పనులు చేసుకుంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి రోడ్డు ప్రమాదం తీరని శోకాన్ని మిగిల్చింది. ముగ్గురు బిడ్డల తల్లిని మూడేళ్లుగా మంచానికి పరిమితం చేసింది. నిస్సహాయ స్థితిలోని తల్లి తన ముగ్గురు బిడ్డలకు ప్రతినిత్యం వేదన మిగులుస్తోంది. వివరాలు..బట్టేపాడుకు చెందిన కట్టా పెంచలయ్య, కట్టా పద్మ దంపతులు. మూడేళ్ల క్రితం చేజర్ల మండలం బోడిపాడుకు పెళ్లికి వెళ్తుండగా రోడ్డు మార్జిన్‌లో మోటార్‌సైకిల్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో పెంచలయ్య సురక్షితంగా బయటపడగా, పద్మ తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లింది. నెల్లూరులోని బొల్లినేని ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు ఆపరేషన్ చేశారు. మరో ఐదు నెలలకు నెల్లూరులోని సింహపురి ఆస్పత్రిలో రెండోసారి ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్లు చేయించినా ఇప్పటి వరకు ఆమెకు స్వస్థత చేకూరలేదు. మంచానికే పరిమితమై నిలబడడం, కూర్చోవడం, తినడంలాంటి దైనందిన జీవితం కూడా గడపలేకపోతోంది. పెంచలయ్య ఒక్కడే కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించాల్సి రావడంతో పోషణ భారంగా మారింది. దీంతో ముగ్గురు బిడ్డల్లో పెద్దవాడైన కట్టా చరణ్ పదో తరగతితో చదువు మానేసి కూలీ పనులకు వెళ్తున్నాడు. మరో ఇద్దరు సంతానమైన కట్టా వరూధిని, కట్టా హర్ష స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 5, 2వ తరగతులు చదువుతున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న అమ్మఒడి నగదుతో చదువు కొనసాగిస్తున్నారు. కూలీ పనులకు వెళ్లి సంపాదించే సొమ్ముతో ఏ రోజుకారోజు కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోందని, కూలీ పనులు లేకుంటే కుటుంబం మొత్తం పస్తులు ఉండాల్సిందేనని పెంచలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. తమ కుటుంబానికి సంరక్షకురాలిగా ఉన్న పద్మ ఆరోగ్యాన్ని బాగు చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక నిస్సహాయ స్థితిలో ఉన్నామని, తమ దీనస్థితిని గమనించి దయగల దాతలు 93819 55693 ఫోన్‌పే నంబర్‌కు సాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.